ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5



పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 9 డిసెంబరు 2025

ధాన్యం కొనుగోలులో అక్రమాలు.. సిబ్బంది తొలగింపు

పార్వతీపురం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడుతున్న ఐదుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను విధుల నుంచి తొలగిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలు అందుబాటులో లేనప్పటికీ వారు ట్రక్‌షీట్లు జనరేట్ చేసినట్లు గుర్తించామన్నారు. చిన్నగొడబలో పి.చిన్న, పెద్దబొండపల్లిలో ఆర్.సుధారాణి, పలగరలో బి.పృథ్వీ, వెంకటభైరిపురం ఆర్‌ఎస్‌కే పరిధిలో సాగర్, డీకేపట్నంలో జి.రవిని సర్వీస్ నుంచి టెర్మినేట్ చేశామని ఆయన పేర్కొన్నారు.

అనుమతులు రాక.. కట్టుకోలేక!

- ముందుకు సాగని పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు
- పూరిపాకలు తొలగించి.. పనులకు శ్రీకారం చుట్టిన లబ్ధిదారులు
- ఆ ప్రాంతంలో ఆర్‌ఎఫ్‌లో ఉందంటూ అటవీశాఖ అభ్యంతరం
- ఐదు నెలలు గడిచినా.. తేలని పంచాయితీ
- నిలువనీడ లేక గిరిపుత్రుల అవస్థలు
- ఇదీ పీవీటీజీ గ్రామం నారాయణగూడలో పరిస్థితి



గ్రామంలో వేరే చోట తాత్కాలికంగా పరదాలు కట్టుకుని జీవిస్తున్న గిరిజన లబ్ధిదారులు

సీతంపేట రూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): పక్కా గృహాలు మంజూరయ్యాయని ఆ గ్రామ గిరిజనులు ఎంతో సంబరపడ్డారు. నిర్మాణ పనులు వేగవంతం చేసి సొంతింటి కలను నెరవేర్చుకుందామని ఆశపడ్డారు. అయితే వారి ఆనందం ఎంతోకాలం నిలవలేదు. అధికారుల హామీతో ఉన్న పూరిళ్లను తొలగించి గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టిన వారికి నిరాశే ఎదురైంది. అనుమతుల పేరుతో అటవీశాఖ అభ్యంతరాలు తెలిపింది. దీంతో కొన్నినెలలుగా నారాయణగూడ గిరిజనులు నిలువనీడ లేక నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ఆ గ్రామస్థులు మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

సీతంపేట ఏజెన్సీలో మారుమూల పీవీటీజీ గ్రామమైన నారాయణగూడలో 39 గిరిజన కుటుంబాలు(ప్రిమిటివ్ వనరుబుల్ ట్రైబల్ గ్రూప్స్-పీవీటీజీ) గడిచిన 20ఏళ్లుగా నివసిస్తున్నాయి. 2023- 24లో పీఎం జన్‌మన్ పథకం కింద ఆ గ్రామంలోని 13మందికి గృహాలు మంజూరయ్యాయి. రెవెన్యూ, హౌసింగ్ శాఖ అధికారులు లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పుడు నివసిస్తున్న స్థలంలో ఇంటి నిర్మాణానికి పునాదులు తవ్వుకుంటే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. దీంతో పట్టలేని ఆనందంతో ఆ గ్రామానికి చెందిన సవర గంగమ్మ, గణేష్, దుర్గారావు, చిరంజీవి, జక్కమ్మ, ముఖలింగం, జగపతి, లక్కమ్మతో పాటు మరికొందరు తాము నివసిస్తున్న పూరి పాకలను తొలగించి ఇంటి నిర్మాణానికి సన్నద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు నారాయణగూడ గ్రామానికి చేరుకున్నారు. ఆర్ఎఫ్(రిజర్వ్ ఫారెస్ట్) పరిధిలో ఈ ప్రాంతం ఉందని అభ్యంతరం తెలిపారు. గిరిజన లబ్ధిదారులతో వాదనకు దిగారు. ఇక్కడ ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టాలన్నా అటవీశాఖ అనుమతులు ఉండాలని ఫారెస్ట్ అధికారులు గట్టిగా చెప్పడంతో ఇళ్ల పనులకు బ్రేక్ పడింది. సుమారు ఐదు నెలలు గడుస్తున్నా.. ఇంకా అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో నారాయణగూడ గిరిజనులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు.

వినతులు ఇచ్చినా..

ఇళ్ల నిర్మాణాలకు అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో గిరిజనులు సొంత నిధులను సమకూర్చుకొని

(మిగతా 8వ పేజీలో...)



రేకులు అడ్డుపెట్టుకుని నివాసం ఉంటున్న గిరిపుత్రులు



ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులు ఖాళీగా వదిలేసిన స్థలం

‘ఉపాధి’లో ముఖహాజరు

- వేతనదారులకు తప్పనిసరి
- అక్రమాలకు చెక్ పెట్టేందుకు చర్యలు



పార్వతీపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు ముఖ హాజరు తప్పనిసరి చేశారు. అక్రమాలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ నూతన విధానాన్ని అమలు చేస్తోంది. ఇకపై పనులకు వెళ్లే వేతనదారులు విధిగా ముఖహాజరు వేయాలి. లేకుంటే పనులు చేసినా.. హాజరుకానట్టుగా నమోదవుతుంది. కూలి కూడా జమ కాదు. గతంలో పనులు చేపట్టిన ప్రాంతంలో మాన్యువల్‌గా వేతనదారుల హాజరు నమోదు చేసేవారు. కేవలం జాబ్‌కార్డు ఉంటే చాలు.. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారికి కూడా స్థానికంగానే హాజరు వేసేవారు. మృతుల పేర్లను మస్టర్లలో నమోదు చేసేవారు. స్థానికంగా లేని వారి జాబ్ కార్డులను వినియోగించుకుని కొంతమంది అక్రమాలకు పాల్పడేవారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టినా.. క్షేత్రస్థాయిలో మార్పు రావడం లేదు. ఈ నేపథ్యంలో ఇటువంటి అక్రమాలకు చెక్ పట్టేందుకు కేంద్రం వేతనదారులకు ముఖ హాజరు తప్పనిసరి చేసింది. ఇప్పటికే జిల్లాలో ఈ విధానం అమలవుతోంది. వలస బాట పట్టిన వారు, స్థానికంగా లేని వారి జాబ్‌కార్డులను సైతం తొలగించారు. ప్రస్తుతం జిల్లాలో రెండు లక్షల వరకూ జాబ్‌కార్డులు ఉన్నాయి. దీనిపై డ్వామా పీడీ రామచంద్రరావును వివరణ కోరగా.. ‘పనులు చేపట్టే ప్రాంతంలో వేతనదారులకు ఫేస్ హాజరు తప్పనిసరి చేశాం. దీనిపై క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఈ నెల నుంచి జిల్లాలో ఈ నిబంధన అమలవుతోంది.’ అని తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై దృష్టి సారించండి

- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి సత్యనారాయణ
- బాత్‌రూమ్‌లు వినియోగించకపోవడంపై ఆగ్రహం
- వార్డెన్, కుక్ సస్పెండ్‌కు ఆదేశాలు

కురుపాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై దృష్టి సారించాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి సత్యనారాయణ ఆదేశించారు. మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేయాలన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సోమవారం కురుపాంలో జ్యోతి బాపులే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. భోజనం, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. సిలబస్ ఎంతవరకు అయ్యిందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శత శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని అక్కడి సిబ్బందికి సూచించారు. అనంతరం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో నూతనంగా నిర్మించిన స్నానపు గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. వాటికి రన్నింగ్ వాటర్ సదుపాయం లేదని గుర్తించారు. బాత్ రూములను వినియోగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వార్డెన్ శ్రీనివాసరావు, కుక్ సోమేశ్వరరావును సస్పెండ్ చేయాలని ఆదేశించారు.



బాత్‌రూమ్స్ వద్ద రన్నింగ్ వాటర్ ట్యాప్‌ను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి

గిరిజనుల సంస్కృతి గొప్పది
● ఎమ్మెల్సీ గోరటి వెంకన్న
8లో

అమ్మో.. చలి!
మంచు కురిసే వేళలో..
6లో

విద్యా వ్యవస్థ కోసం..
మీరా మాట్లాడేది?
● వైసీపీపై మంత్రి సంధ్యారాణి ధ్వజం
8లో

మత్తుకు బానిస కావొద్దు



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు

- ‘అభ్యుదయ సైకిల్ ర్యాలీ’లో కలెక్టర్, ఎస్పీ

బెలగాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు ఎవరూ బానిస కావొద్దని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. డ్రగ్స్ నియంత్రణలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన అభ్యుదయ సైకిల్ ర్యాలీ సోమవారం పార్వతీపురం చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని చర్చి సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు సాగిన ఈ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు. సైకిల్ తొక్కి అందర్నీ ఉత్సాహపరిచారు. ముందుగా ఏఎస్పీ వెంకటేశ్వరరావు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ‘డ్రగ్స్ వద్దు బ్రో... గంజాయి వద్దు.. జీవితం ముద్దు’ అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్లు స్వప్నిల్ జగన్నాథ్, వైశాలి, ఏఎస్పీ మనీషా తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యం

పార్వతీపురం టౌన్: డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఎస్పీ మాధవరెడ్డి కోరారు. సైకిల్ ర్యాలీ అనంతరం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో ఎవరూ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. దీనిపై ఇప్పటికే ‘సంకల్పం’ ద్వారా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థి దశలోనే ‘ఏది మంచి, ఏది చెడు’ అనేది గ్రహించాలన్నారు. యువత భవిష్యత్‌ను కాపాడేందుకు విద్యాసంస్థలను మత్తు రహిత ప్రాంతాలుగా మార్చడం ఎంతో అవసరమని వెల్లడించారు. గంజాయి, మాదకద్రవ్యాలు ఎవరు అమ్మినా, కొనుగోలు చేసినా.. వెంటనే 1972, 1100 లేదా 112కు సమాచారం అందించాలని సూచించారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించబోం: కలెక్టర్

పార్వతీపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో మిల్లర్లు, అధికారులతో ఆయన మాట్లాడుతూ.. ‘జిల్లాలో కొంతమంది మిల్లర్లు నిబంధనలు పాటించడం లేదు. అటువంటి వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టండి. రైతులను గౌరవించని వారిని క్షమించేది లేదు. అవకతవకలకు పాల్పడిన కొన్ని మిల్లులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. ఇప్పటికీ కొంతమంది మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసం. ప్రతి రైస్‌మిల్లు, రైతు సేవా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిబంధనలు, తదితర వివరాలతో కూడిన వాల్ పోస్టర్లను ఉంచాలి. గన్ని బ్యాగ్‌లు ఇచ్చిన వాటికి సంబంధించి రైతు ఖాతాలో ఆ డబ్బులు జమ అవుతాయన్న విషయాన్ని తెలిజేయాలి. వ్యవసాయాధికారులు, సివిల్ సప్లైస్, ధాన్యం కొనుగోలు సిబ్బందితో కలిసి గ్రామాల్లోకి వెళ్లాలి. ధాన్యం కొనుగోలుపై అవగాహనా సమావేశాలు నిర్వహించాలి. రైతులకు ఇచ్చే బిల్లుల విషయంలో స్పష్టత పాటించాలి.’ అని తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లైస్ డీఎం శ్రీనివాస్, డీఎస్‌వో బాలసరస్వతి, డీఏవో అన్నపూర్ణ, జిల్లా రైస్‌మిల్లర్లు సంఘం అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
● ప్రభుత్వ విప్ జగదీశ్వరి
8లో

పత్తి కొనుగోలులో జాప్యం
● నిబంధనలతో రైతులకు అవస్థలు
8లో



రేషన్ డిపోల్లో రాగులు

- ఈనెల నుంచే ఉచితంగా పంపిణీ
- తొలుత అర్బన్ ప్రాంతాల్లోనే..



పాలకొండ, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్ డిపోల ద్వారా ఈ నెల నుంచే కార్డుదారులకు రాగులు సరఫరా చేయనున్నారు. ప్రజలకు పౌష్టికాహారం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికారులు ఈ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే అర్బన్ ఎంఎల్‌ఎస్ పాయింట్లు సాలూరు, పాలకొండ, పార్వతీపురంలో 150 టన్నులు రాగులను అందుబాటులో ఉంచారు. బియ్యం వద్దనుకున్న కార్డుదారులకు రాగులను సరఫరా చేసేందుకు పౌరసరఫరాల శాఖాధికారులు సన్నద్ధమవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం బియ్యం, చక్కెర మాత్రమే అందించేవారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర సరుకులు ఆకాశన్నంటుతుండడం , ప్రజారోగ్యం దృష్ట్యా కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. గతంలోనూ టీడీపీ ప్రభుత్వం రాగులు, రాగిపిండిని కార్డుదారులకు సరఫరా చేసేది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా పథకం కింద చిరుధాన్యాలను కొనుగోలు చేసి సరఫరా చేసేది. ప్రస్తుతం వాటిని సరఫరా చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే ప్రాసెసింగ్ చేసి కార్డుదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది.

పంపిణీ ఇలా...

జిల్లా వ్యాప్తంగా 578 రేషన్ డిపోలు ఉన్నాయి. వాటి పరిధిలో 2.80 లక్షల కార్డులు ఉన్నాయి. మొత్తంగా ప్రతి నెలా 8.31 లక్షల మంది రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు పొందు తున్నారు. జిల్లా వ్యాప్తంగా 5,200 టన్నుల బియ్యాన్ని కార్డుదారులకు ఉచితంగా అందిస్తున్నారు. అయితే ఈ నెల నుంచి బియ్యానికి బదులుగా రాగులును ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. కార్డుదారుల కోరిక మేరకు సుమారు మూడు కిలోలు నుంచి ఆరు కిలోల వరకు రాగులును ఉచితంగా అందించనున్నారు. ప్రస్తుతం చాలామంది కార్డుదారులు రేషన్ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అయితే తాజాగా బియ్యానికి బదులుగా ఉచితంగానే రాగులును సరఫరా చేస్తున్న నేపథ్యంలో అధికశాతం మంది వాటిని తీసుకొనేందుకే మొగ్గుచూపే అవకాశం ఉంది.



ఈ నెల నుంచే సరఫరా

‘జిల్లా వ్యాప్తంగా అర్బన్ ఎంఎల్‌ఎస్ పాయింట్లలో 150 టన్నుల రాగులును అందుబాటులో ఉంచాం. కార్డుదారులు కోరితే ఈ నెల నుంచే బియ్యానికి బదులుగా రాగులును ఉచితంగా సరఫరా చేయాలని డీలర్లను ఆదేశించాం.’ అని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి బాలసరస్వతి తెలిపారు.

అమ్మో.. చలి!

- భారీగా పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు
- చిన్నారులు, వృద్ధులపై ప్రభావం
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు





విజయనగరం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చలి వణికిస్తోంది. గత మూడు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే చలి తీవ్రత పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే మరీ ఎక్కువగా ఉంటోంది. ఇక నగరాల్లో ఎండ వచ్చే వరకూ బయటకు రాని పరిస్థితి. డిసెంబరు నెలలో చలి ఉండడడం సాధారణమే అయినా.. ఈఏడాది మరింత ఎక్కువగా ఉంది. చలితో పాటు మంచు వాతావరణం కావడంతో ఇంటి గోడలు కూడా చల్లబడి పోతున్నాయి. రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15-20 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి.

- బంగాళాఖాతం మీదుగా తూర్పుగాలులు వీయకపోవడంతో ఈశాన్య రుతుపవనాలు బలహీనంగా మారాయి. దీంతో అన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంది. అదే సమయంలో ఉత్తర, మధ్య భారతం మీదుగా రాష్ట్రంపైకి తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయన్న అభిప్రాయం వాతావరణ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకి కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తున్నాయి. రానున్న వారం రోజులు కూడా ఇదే పరిస్థితి ఉంటుందని, ఆ తరువాత రాత్రి పూట చలి కాస్త తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

వృద్ధులు వెచ్చని దస్తులు ధరించాలి

వృద్ధులు వెచ్చని దుస్తులు ధరించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు వెళ్లడం తగ్గించాలి. గోరువెచ్చని నీరు తాగాలి. ఫ్లూ టీకా తీసుకోవవడం మంచిది. మహిళలు చర్మం పొడిబారికాకుండా మాయిశ్చరైజర్లు వాడాలి. పోషకాహారం, విటమిన్-డి ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. శిశువులకు వెచ్చని దుస్తులతో కప్పి ఉంచాలి. తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవాలి.

- జీవనరాణి, జిల్లా వైద్యాధికారిణి

చలి దుస్తులకు పెరిగిన డిమాండ్

జిల్లా వ్యాప్తంగా చలిని తట్టుకునే దుస్తుల వైపు ప్రజలు చూస్తున్నారు. విజయనగరంతో పాటు ఎస్‌కోట, బొబ్బిలి, గజపతినగరం, డెంకాడ, భోగాపురం, తీర ప్రాంత గ్రామాల్లో కూడా చలి పెరగడంతో చలి తట్టుకునే దుస్తులకు డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా కొలకొత్తా, హైదరాబాదు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రోడ్లపైనే వీటిని పెట్టి విక్రయిస్తున్నారు. 200 రూపాయల నుంచి 1,500 వరకూ వీటి ధర ఉంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు.. మహిళలు, పురుషులు అందరికీ వివిధ రకాల మోడళ్లల్లో ఇవి లభిస్తున్నాయి. విజయనగరంలో అయితే పెద్ద చెరువు చుట్టూ ఉన్న ఫుట్‌పాత్‌పై వ్యాపారులు వీటి విక్రయాలు చేస్తున్నారు.



చలి బాగా పెరిగింది

మూడు రోజులుగా చలి విపరీతంగా పెరిగింది. దీంతో ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. చలిని తట్టుకునేందుకు వీలుగా స్వెట్టర్‌ను వినియోగించక తప్పడంలేదు. గత ఏడాది ఇంత చలి లేదు. ఈ ఏడాది సంక్రాంతి రాకముందే ఇంత చలి ఉంటే రానున్న వారం పది రోజుల్లో ఎలా ఉంటుందోనని ఆందోళనగా ఉంది.

- ఎం.కుమారి, నెల్లిమర్ల

ఊహించలేదు

చలి ఇంతగా ఉంటుందని ఊహించలేదు. నవంబరు నెల తొలి వారంలో పెద్దగా చలిలేదు. ఇప్పుడు సాయంత్రం ఆరు గంటలు దాటితే చలి కారణంగా బయటకు రాలేని పరిస్థితి. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో చలిని తట్టుకునేందుకు క్యాప్‌లు, చలి బనియన్లు (స్వెట్టర్స్) ధరిస్తున్నాం.

- ఎస్.శంకర్, విజయనగరం

సైనికుల కోసం విరాళాలు అందించండి

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి పిలుపు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టరు రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ భద్రత కోసం నిరంతరం కృషిచేస్తున్న సైనికుల సంక్షేమం కోసం సామర్థ్యానికి తగినట్లుగా విరాళాలు అందించాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జాతీయ సాయుధ దళాల పతాక దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరు సాయుధ దళాల పతాక నిధికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి సేవలందిస్తున్న సైనికులు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

పీజీ ఆర్‌ఎస్‌లో 273 వినతులు

విజయనగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియం సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో వివిధ సమస్యలపై 273 వినతులొచ్చాయి. రెవెన్యూకు సంబందించి 120 వినతులు, డీఆర్‌డీఏ 45 విరతె, మునిసిపల్ శాఖకు పది, పంచాయితీ శాఖ 13, విద్యుత్ శాఖకు 10, వైద్య ఆర్యోగ శాఖకు 15 వినతులు అందాయి. కలెక్టరు రామసుందర్ రెడ్డి, జేసీ సేతు మాధవన్, డీఆర్వో మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, శాంతి ,కళావతి తదితరులు వినతులు స్వీకరించారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపండి

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయనతో పాటు డీఆర్వో కె.హేమలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి వినతులను స్వీకరించారు. గరుగుబిల్లి మండలం చినగుడబ గ్రామానికి చెందిన ఎం.శ్రీదేవి గ్రామ రెవెన్యూలో 1ఏ ఐదు సెంట్ల పల్లం భూమిని ఆన్‌లైన్ చేయాలని అర్జీ అందజేశారు. గుమ్మలక్ష్మీపురంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన చర్చిని తొలగించాలని పి.ప్రసాదరావు వినతిపత్రం సమర్పించారు. బలిజిపేట మండలంలోని పెద్దబైరిపురాన్ని పంచాయతీ చేయాలని ఆర్.చంద్రశేఖరరావు అర్జీ అందజేశారు. తోటపల్లి నిర్వాసితులకు ఇచ్చిన స్థలాన్ని వేరే వ్యక్తులు ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని రామకృష్ణ, గుంపస్వామి, వేణు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన బిడ్డ నడవలేని పరిస్థితిలో ఉన్నాడని, ఆరోగ్య పరిస్థితి బాగోలేదని దామోదర్‌నాయుడుకు కలెక్టర్‌కు వివరించారు. తన బిడ్డకు పింఛన్ మంజూరు చేయాలని పట్టణానికి చెందిన కె.రవి అధికారులను కోరారు. దివ్యాంగుల శాతాన్ని తక్కువగా చూపించడం తాత్కాలిక ధ్రువీకరణ పత్రం ఇవ్వడం వల్ల పింఛను మంజూరు కావడం లేదని చెప్పారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి: ఎస్పీ

విజయనగరం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ పరిధిలో ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, 40 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదు అంశాలను పరిశీలించి వాస్తవమైతే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఫిర్యాదు అంశాలు వాస్తవమైతే తీసుకున్న చర్యలను ఏడు రోజుల్లో నివేదించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ సౌమ్యల, సీఐలు ఏవీ లీలారావు, కుమారస్వామి, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల పోటీలకు ఎంపిక

దత్తిరాజేరు మండలంలోని వంగర గ్రామానికి చెందిన ఈదుబిల్లి సూర్యనారాయణ అమెరికాలో జరగనున్న అంతర్జాతీయ దివ్యాంగుల పోటీలకు ఎంపికకావడంపై ఎస్పీ దామోదర్ అభినందించారు.క్రీడల్లో రాణించేందుకు అంగ వైకల్యం అడ్డుకాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ముంబాయిలో అమెచూర్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల బాడీబిల్డింగ్ పోటీల్లో సూర్యనారాయణ బంగారు పతకం సాధించాడు. ఈ మేరకు సోమవారం విజయనగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సూర్యనారాయణ ఎస్పీ దామోదర్‌ను కలిశారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్సు జిల్లా గౌరవాధ్యక్షుడు దయానంద్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



విజయనగరం క్రైం: ఫిర్యాదుదారుడి నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

రోడ్డు ప్రమాదాల నియత్రణకు చర్యలు

భోగాపురం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసులకు సూచించారు. సోమవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి పోలీసులకు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని చెప్పారు. ద్విచ క్రవాహనచోదకులు హెల్మెట్ ధరించడంపై అవగాహనకల్పించాలని కోరారు. ఎయిర్ పోర్టు సమీప గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అంతక ముందు స్టేషన్ ఆవరణ, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ కె.దుర్గా ప్రసాదురావు, ఎస్ఐ వి.పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లిమర్ల: ధర్నా చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు



గజపతినగరం: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

వేతన సవరణ చేయాలి

- జీవో -36ను అమలు చేయాలి
- పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

వేతన సవరణ చేయడంతోపాటు జీవో-36ను అమలుచేయాలని పీఏసీఎస్ ఉద్యోగులు డిమాండ్‌చేశారు.ఈ మేరకు సోమవారం పీఏసీఎస్, డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

గజపతినగరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సహకార సంఘ ఉద్యోగులు నల్లబ్యాడ్జిలతో గజపతినగరంలోని డీసీసీబీ బ్రాంచ్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీబీ ఉద్యోగుల జనరల్‌రాష్ట్ర సెక్రటరీ, పీఏసీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కేవీఎస్ రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఈవో నారాయణరావు, పీఏసీఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

- గుర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెట్టంగి, జమ్ముపేట, కెల్ల, గూడెం పీఏసీఎస్ ఉద్యోగులు గుర్ల డీసీసీబీ బ్యాంకు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పరపతి సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లాన రామునాయుడు మాట్లాడుతూ జీవో-36ను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేపట్టాలని, మధ్యంతర భృతి ఇవ్వాలని, చట్టప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్యాంచ్ మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. నాలుగు సొసైటీల నుంచి సీఈవోలు హారజయ్యారు.
- గంట్యాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సహకార ఉద్యోగులు గంట్యాడ సహకార బ్యాంకు వద్ద నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని కోరారు. సహకార ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.
- నెల్లిమర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వలిరెడ్డి గిరిబాబు డిమాండ్ చేశారు. నెల్లిమర్లలోని డీసీసీబీ బ్రాంచ్ వద్ద ఏపీ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసి ఏజీఎం కో.రజనికి వినతి పత్రం అందజేశారు.



గుర్ల: డీసీసీబీ బ్రాంచి మేనేజర్‌కి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



గంట్యాడ: నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

- ఎస్పీ మాధవరెడ్డి



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులను త్వరం పరిష్కరించి అర్జీదారులక న్యాయం చేయాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీసు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన 9 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, ఎస్ఐ రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.



పత్తి పంటను ధ్వంసం చేస్తున్న ఏనుగులు

బియ్యాలవలసలో ఏనుగులు

కురుపాం రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): బియ్యాలవలస పరిసరాల్లో సోమవారం ఏనుగుల గుంపు సంచరించింది. కోతకు వచ్చిన పత్తి పంటను ధ్వంసం చేశాయి. దీంతో స్థానికులు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఏనుగులను రెచ్చగొట్టవద్దంటూ అటవీశాఖ అధికారులు ప్రజలకు సూచించారు. ఏనుగుల జోలికి వెళ్లరాదన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

టెట్ పక్కాగా నిర్వహించాలి

- ఐదు కేంద్రాల్లో పదో తేదీనుంచి పరీక్షలు
- డీఆర్వో మురళి



మాట్లాడుతున్న మురళి

విజయనగరం, కలెక్టరేట్ డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) జిల్లాలోని టెట్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని డీఆర్వో మురళి కోరారు. సోమవారం విజయనగరంలో టెట్ పరీక్షలు నిర్వహణకు సంబందించి ఆయా శాఖ అధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐదు కేంద్రాల్లో ఈనెల 10 నుంచి 21 తేదీ వరకూ జరిగే పరీక్షలకు 13,985 మం ది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. ఉదయం 9.30 గంటలు నుంచి 12 వరకూ, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటలు వరకూ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఐయాన్ డిజిటల్ జోన్‌లో 3129 మంది, ఎంవీజీఆర్‌లో 4035 మంది, లెండిలో 4800, సత్య ఇంజనీరింగ్‌లో 1571 మంది, అవంతి ఇంజనిరీంగ్‌లో 450 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. పరీక్షకు హాజరు కానున్న అభ్యర్థుల హాల్ టిక్కెట్‌తో పాటు ఒరిజనల్ ఐడి కార్డు తీసుకుని రావాలని సూచించారు. పరీక్ష సమయం కంటే 30 మందు హాజరు కావాలని సూచించారు . పరీక్ష కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



పోలిపల్లిలో పనులను పరిశీలిస్తున్న సుగుణాకరరావు

భోగాపురం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): భోగాపురం, పోలిపల్లి, కవులవాడ, అమటాంరావివలస, గూడెపువలసల్లో ఉపాధి పథకంలో భాగంగా నిర్వహించిన జలశక్తి అభియాన్ పనులను సోమవారం కేంద్ర వాటర్ కమిషన్ సభ్యుడు పి.సుగుణాకారరావు పరిశీలించారు. ఇటీవల చేసిన పనులను పరిశీలించి నమోదు చేసుకొన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం సిబ్బందిని పలు విషయాలు అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీడీ స్వరూపరాణి, కోర్సు డైరెక్టర్ చిన్నంనాయుడు, ఏపీవో భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..

సీతంపేట రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో కొన్ని రోజులుగా పొగమంచు విస్తారంగా కురుస్తోంది. దీంతో చలితీవ్రత అమాంతం పెరిగింది. చలి తీవ్రతతో ఉదయం 7 గంటల వరకూ మన్యం వాసులు బయటకు వచ్చే పరిస్థితి లేకుంది. మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి చలి తీవ్రత పెరుగుతుండటంతో మన్యం వాసులు అల్లాడుతున్నా రు. రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈఏడాది చలి ఎక్కువగా ఉందని గిరిజనులు అంటున్నారు.

సీతంపేట ఏజెన్సీలో దట్టంగా కురుస్తున్న పొగమంచు



వైర్లు సరిచేయక.. విద్యుత్ సరఫరా కాక

● అంధకారంలో గజపతినగరం జాతీయరహదారి ● చీకట్లోనే వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న వైనం

గజపతినగరం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం జాతీయ రహదారికిపై పురిటిపెంట పంచాయతీ పరిధిలో ఉన్న విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో నెలకొంది. ఇటీవల ఇక్కడి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఓ ప్రైవేటు షాపు ప్రారంభోత్సవం జరుగుతున్న సమయంలో జాతీయరహదారిపై అధికంగా జనాభా ఉండడంతో ఆర్టీసీ బస్సు వారిని తప్పించబోయి విద్యుత్ వైర్లు ఢీకొనడంతో అవి తెగిపోయాయి. దీంతో ట్రాన్స్‌కో సిబ్బంది ప్రమాదాన్ని నివారించేందుకు వైర్లను తప్పించారు. ఈ ఘటన జరిగి వారంరోజులు దాటుతున్నా వైర్లు సరిచేయకపోవడంతో గజపతినగరంలో పోలీస్‌స్టేషన్ నుంచి ఆ మార్గంలో కొంతవరకూ చీకటిపడితే అమావాస్య తలపిస్తోందని పలువురు వాపోతున్నారు. దీంతో రోడ్డు పక్కన వ్యాపారాలు సాగిస్తున్న చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చీకటిపడిన తర్వాత వచ్చిపోయే వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. పంచాయతీ, ట్రాన్స్‌కో అధికారులు వైర్లు సరిచేయడానికి చర్యలు తీసుకోకపోవడంతో చీకట్లోనేవ్యాపారాలుసాగించాల్సి వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు. కాగా జాతీయరహదారిపై ఉన్న విద్యుత్ వైర్లు సరిచేసే విదంగా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని పురిటిపెంట ఈవో జగదీష్ తెలిపారు. నాలుగురోజుల కిందట బదిలీపై వచ్చానని, సిబ్బందితో మాట్లాడి విద్యుత్ సరఫరా పునరుద్ధరించనున్నట్లు చెప్పారు.



జాతీయరహదారిపై వెలగని లైట్లు

వినతులకు తక్షణ పరిష్కారం



వినతిని పరిశీలిస్తున్న నల్లనయ్య

విజయనగరం టౌన్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులను పరిశీలించి తక్షణ పరిష్కారం చూపించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా ఫిర్యాదులు వేదికలోవచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులతో పాటు క్షేత్రస్థాయిలో తాము పర్యటించిన సమయంలో వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

శృంగవరపుకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలో గిరిజనసంక్షేమపాఠశాలకు ఐదెకరాల స్థలం కేటాయించాలని ఇండియన్ రెడ్‌క్రాస్‌సొసైటీ ప్రతినిధి దొడ్డి సూర్యారావు కోరారు.ఈ మేరకు సోమవారం పాఠశాల కమిటీ చైర్మన్ కె.లక్ష్మి, హెచ్‌ఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు.

సృజనాత్మకత పెంపునకు శిక్షణ

రేగిడి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బోధనలో నైపుణ్యత పెంపునకు టీచ్ టూల్ శిక్షణఇస్తున్నట్లు ఎంఈవో వరప్రసాదరావు, శిక్షణ జిల్లా పరిశీలకులు రమేష్ పేర్కొన్నారు. సోమవారం రేగిడి జడ్పీపాఠశాలలో టీచ్‌టూల్‌పై స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, హెచ్‌ఎంలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోధన సామర్థ్యం,సృజనత్మకత పెంపునకు ఇస్తున్న సమగ్ర శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్య క్రమంలో ఎంఐసీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సూర్యారావు పాల్గొన్నారు.

● మెరకముడిదాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంకేతిక సాధనాలు ద్వారా వృత్తి పరమైన పనులను సులభతరంగా పూర్తిచేసేందుకు ఉపయోగపడే టెక్ టూల్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవోలు ఎం.చంద్రశేఖర్, టి.ధర్మశ్రీనులు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, రిసోర్సు పర్సన్లు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

వైఫల్యాలను ఎండగట్టాలి

లక్కవరపుకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైసీపీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గోల్డ్ స్టార్ జంక్షన్‌లో కోటి సంతకాలపై ఎస్.కోట నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, మాజీ జెడ్పీ చైర్మన్ స్వాతీ రాణి హాజరయ్యారు.

స్క్రబ్‌టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి

సంతకవిటి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):స్క్రబ్‌టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ కోరారు. ఈ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు సచివాలయ, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం సంతకవిటి మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారులు యు.నాగేంద్రప్రసాద్, సతీష్‌కుమార్‌తో కలిసి సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య శాఖ సిబ్బందితో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై సమీక్షించారు.

విస్తృత ప్రచారం

లక్కవరపుకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్‌పై విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు ఎల్.కోట పీహెచ్‌సీ వైద్యుడు బి.అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 31 పంచాయతీల్లో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌సీలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎవరికైనా ఏదైనా పురుగు కుట్టి నల్లటి మచ్చ ఏర్పడితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని కోరారు.

గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయం

● శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

వేపాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. సోమవారం మండలంలోని కొండగంగుబూడి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతు పండించే ప్రతి గింజను ప్రభుత్వమే కొంటుందన్నారు. కార్యక్రమంలో ఏవో స్వాతి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, గొలగాని కృష్ణమూర్తి, వెంకటరావు, పరవాడ జగదీష్ ,ముమ్మలూరి సూర్యనారాయణ, సింహాద్రి సత్తిబాబు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):పేదలకు సీఎంఆర్‌ఎఫ్ భరోసాగా నిలుస్తోందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. సోమవారం రాజాంలోని టీడీపీ కార్యాలయంలో 16 మందికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంప్రజారోగ్యం, సంక్షేమంకోసం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, కిమిడి అశక్షక్‌కుమార్, దూబ ధర్మారావు, దువ్వలపూడి శ్రీనివాసరావు, టి.గణపతి, మద్ద హరి, మరిపి జగన్మోహన్‌రావు, శాసపు రమేష్‌కుమార్, టంకాల కన్నంనాయుడు, మాడుగుల జయరాం పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలను ఆదుకుంటాం

● నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ బాధిత మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం ద్వారా ఆదుకొనేందుకు చర్యలు తీసుకుంటామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. సోమవారం కొండ్రాజుపాలెంలో హేచరీస్ నిర్వాహకుల ఆర్థిక సహాయంతో బంగ్లాదేశ్ బాధిత తొమ్మిది మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు, 25 కేజీల బియ్యం చొప్పున అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో బందీలుగా ఉన్న మత్స్యకారులతో నేరుగా మాట్లాడడం కుదరడంలేదని, అక్కడ జైలర్‌తో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నామని, అందరూ క్షేమంగానే ఉన్నారని తెలిపారు.బందీలుగా ఉన్న మత్స్యకారులు రావడానికి ఆరు నెలల సమయం పట్టే అవకాశముందని, వారువచ్చే వరకూ వారి కుటుంబాలను ప్రభుత్వం ద్వారా ఆదుకొనేలా ప్రయత్నాలుచేస్తామని తెలిపారు.అనంతరం కొంగవానిపాలెం సమీపంలో ఎయిర్‌పోర్టుకు సంబంధించి నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్,రాంబాబు, సూరాడ చిన్నారావు, మట్టా అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో ఆక్రమణల తొలగింపు

శృంగవరపుకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దేవీబొమ్మకూడలి వరకు ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న ఆక్రమణలను సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. సీఐ తన సిబ్బందితో తోపుడ బళ్లను తీసి వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి ఆక్రమణలకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సేవా కార్యక్రమాలు అలవరుచుకోవాలి

రాజాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి స్థాయి నుంచి సేవాకార్యక్రమాలు అలవరుచుకోవాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్దేశ్వరి కోరారు. సోమవారం రాజాంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బొద్దాం ప్రభుత్వోన్నత పాఠశాలలో శ్రమదానం నిర్వహించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెచ్‌వీ శశికుమారి తదితరులు పాల్గొన్నారు.

●శృంగవరపుకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువతరం తమ భవిష్యత్‌ను డ్రగ్స్ నాశనం చేస్తాయన్న విషయం గ్రహించాలని సీఐ నారాయణమూర్తి తెలిపారు. సోమవారం పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీకళాశాలఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సేవాశిబిరం ముగింపు కార్య క్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో భాస్కర్ పాల్గొన్నారు.

●రాజాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజీయ్యపేటలో సోమవారం జీసీఎస్‌ఎస్ ఆర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో ప్రకృతివ్యవసాయంపై సదస్సు నిర్వహించారు.అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతు పెంకి గౌరీశ్వరరావు , ఉపాధ్యాయలు ఎ.సత్యారావు, శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో విశ్వనాధం పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

శృంగవరపుకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో ఈనెల13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయాధికారి కనకలక్ష్మి కోరారు. ఈ మేరకుసోమవారం న్యాయవాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదులు తమ వద్ద ఉన్న కేసులు రాజీ చేయించాలనీ సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

లక్కవరపుకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ప్రజలకు ఆరోగ్యం లభిస్తుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు తెలిపారు. సోమవారం లక్కవరపుకోటలోని వెలుగు, వ్యవసాయ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి సేద్యం ద్వారా పండించిన పంటలకు డిమాండ్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సబ్ డివిజన్ అధికారి భానులత, ఏపీఎం సింహాచలం పాల్గొన్నారు.

నూనె గింజల సాగును ప్రోత్సహించాలి

బొండపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ విధానంలో నూనె గింజల సాగును ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయం ఏపీఎం నాయుడు కోరారు. స్థానిక వెలుగు సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘ సభ్యులతో పాటు ప్రకృతి వ్యవసాయసిబ్బందికి నూనెగింజల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో మల్లిఖార్జునరావు, ఏఈవో సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలు లక్ష్యాలను పూర్తిచేయాలి

రాజాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూలులక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీవో జె.ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు కోరారు. స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో మొబైల్ ఆధార్ నెంబర్లు అప్‌డేషన్ చేయించాలని ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

అల్యూమినియం పరిశ్రమ ఏర్పాటు చేయండి

ఎస్.కోట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర, ఇతర ప్రాంతాల్లో 18 ఏళ్ల కిందట జిందాల్ అల్యూమినియం పరిశ్రమ కోసం తమ భూములు సేకరించారని ఈ భూముల్లో అల్యూమినియం కర్మాగారం ఏర్పాటుచేయకపోతే తమ భూములు వెనక్కి ఇవ్వాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. సోమవారం బొడ్డవరలో 178వ రోజు నిరసన కార్య క్రమంలో భాగంగా మాట్లాడుతూప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటుచేస్తే జిందాల్ ఒప్పందాలు రద్దవుతాయని తెలిపారు.



భూములు వెనక్కి ఇవ్వాలని నినాదాలుచేస్తున్న నిర్వాసితులు

ఏపీఎన్జీవో కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

చీపురుపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏపీఎన్జీవో సంఘం చీపురుపల్లి తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా ఎల్.అప్పలనాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.జగదీశ్వరి, ఉపాధ్యక్షులుగా టీకేకే లక్ష్మణరావు, పి.రవికుమార్, కేవీఎస్‌ఎస్ కిషోర్, ఎల్. వేణుగోపాలరావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా వై. ఝాన్సీ, కార్యదర్శిగా ఎం. అప్పలస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జె.మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శులు గాసాయి అభిరామ్, కె.గోపాలకృష్ణ, ఎస్.హైదర్‌ఆలీ, ఇ.చంద్రకుమారి, కోశాధికారిగా ఎస్. రామారావు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా బీఎస్ ప్రసాద్, జిల్లా కౌన్సిల్‌కు బి. ఉమాశంకర్, కె.రవి, టి.వాసుబాబు, ఎస్.రామ్మోహన్, పి.అరవింద్‌బాబు ఎన్నికయ్యారు.ఎన్నికల పరిశీలకులుగా కేటీ శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పట్టణశాఖ అధ్యక్షుడు వై.ఆనంద్‌కుమార్, పార్వతీపురం తాలూకా యూనిట్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, మధు, శంకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్‌తో అగచాట్లు

రాజాం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):రాజాంలో ఆటోలను రద్దీగా ఉండే ప్రాంతాల్లో పార్కింగ్ చేయడం వల్ల వాహనచోదకులు, పాదచారులు అగచాట్లకు గురవుతున్నారు. తరచూ డీఎస్పీ, సీఐ తదితరులు ఆటోడ్రైవర్లతో సమావేశాలు నిర్వహించి నిబంధనల గురించి వివరిస్తున్న విషయం విదితమే. మెయిన్‌రోడ్‌లోని ప్రభుత్వోన్నత పాఠశాల, పశువుల ఆసుపత్రి, మాధవబజార్ జంక్షన్, సంపత్‌భవన్ వంటి రద్దీగా ఉండే ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కాగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

విజయనగరంలో గంథమహోత్సవం

విజయనగరం రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కోట్ల మాదప్ప వీధిలోని హజరత్ సయ్యద్ దలియాఖాన్ బాబా అవులియా గంధ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉత్సవానికి ముందు అన్నదాన కార్యక్రమం,నమాజ్, బాబాకి పూజలుచేశారు. కార్యక్రమంలో నగర ముస్లింశాఖ ప్రతినిధి మహ్మద్ గౌస్, షేక్ బాబా, సిద్ధిక్, అజీజ్, అజీం, అన్వర్,సలీం పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నియంత్రణకు కృషి చేయాలి

బొండపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సైకాలజిస్టు ఎస్‌వీ రమణ తెలిపారు.రు. సోమ వారం బొండపల్లిలో ఎంపీపీ చల్లా చలం నాయుడు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమలో బొండపల్లి, దేవుపల్లి పీహెచ్‌సీల వైద్యులు ఎల్.సత్యనారాయణ, శర్మిష్టా, ఎంపీడీవో గిరిబాల, ఎంఈవో-2 వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌పి భాషా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



రాజాం: ప్రతిజ్ఞ చేయిస్తున్న అడిషనల్ సీడీపీవో సన్యాసమ్మ

రాజాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అడిషినల్ సీడీపీవో సీహెచ్ సన్యాసమ్మ కోరారు. మునిసిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రకారం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, శిక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

● భోగాపురం,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి):భోగాపురంలో ఐసీడీఎస్ సీడీపీవో లావణ్య ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమలో ఎంపీడీవో స్వరూపరాణి, డిప్యూటీ ఎంపీడీవో గాయిత్రి, ఎంఈవో రమణమూర్తి, సూపర్‌వైజర్ హేమ, పీహెచ్‌సీ వైదాధికారి స్రవంతి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి

పాలకొండ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): పనుకువలస కూడలిలో సోమవారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొనడంతో పొట్నూరు రామినాయుడు (57) మృత్యువాతపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. బుక్కురు గ్రామానికి చెందిన రామినాయుడు పశువులకాపరిగా జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి రహదారి పక్క నుంచి నడుచుకని స్వగ్రామానికి వెళ్తుండగా పాలకొండ నుంచి వీరఘట్టం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఆయన్ను ఢీకొంది. దీంతో ఆయన తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు క్షతగాత్రుడిని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామినాయుడు మృతిచెందారు. మృతుడి భార్య చిన్నమ్మడు కొన్నేళ్ల కొందట మృతిచెందారు. కుమార్తె రూప ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ ప్రయోగమూర్తి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎస్.కోట రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుసోంపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారంసాయంత్రం సబ్బవరం మండలంలోని దువ్వాడ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. సీఐ కథనం మేరకు.. సబ్బవరం మండలంలోని దువ్వాడ కాలనీకి చెందిన కిలారి గంగన్న, గొడ్డు ఆదర్శ్ తమ ద్విచక్రవాహనంపై అరకు నుంచిఎస్.కోట వైపు వస్తున్నారు. అదేసమయంలో ఎస్.కోట నుంచి అరకు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం కాపుసోంపురంవద్ద ఢీకొన్నాయి. దీంతో ఓ ద్విచక్రవాహనంపై ఉన్న గంగన్న, ఆదర్శ్‌కు గాయాలయ్యాయి. కుటుంబసభ్యుల పిర్యాదుమేరకు కేసు నమోదుచేశారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి..

మెంటాడ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆంధ్ర జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి కిలారి రామ్ చరణ్ సోమవారం విద్యుదాఘాతానికిగురై గాయపడినట్లు ఎంఈవోమోహనరావు తెలిపారు. ఎంఈవో, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సోమవారం ఉదయం ప్రత్యేక తరగతుల నిమిత్తం హైస్కూల్‌కు రామ్‌చరణ్ వచ్చాడు. తరగతులు ప్రారంభానికి సమయం ఉండడంతో కొత్తగా నిర్మిస్తున్న పాఠశాల పైభాగానికి వెళ్లాడు. పాఠశాల పైనుంచి కొద్దిసేపటికే కిందకు పడిపోయాడు. శబ్దం విని అక్కడే ఉన్న విద్యార్థులు పరిగెత్తారు. దీంతో రామ్‌చరణ్‌ను చూసిన సహచర విద్యార్థులు భయంతో కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడకు చేరుకున్నారు. గాయపడిన రామ్‌చరణ్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్థులు గజపతినగరం ఏరియాఆస్పత్రికి తీసుకువెళ్లగా, పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం జీజీహెచ్‌కు తరలించారు. శరీరంపై గాయాలు బట్టి విద్యుదాఘాతానికి గురైనట్లు వైద్యులు స్పష్టంచేశారు. కాగా పాఠశాల భవనం పైనుంచి వెళ్తున విద్యుత్ వైర్లు తొలగించాలని విద్యుత్ అధికారులను లిఖితపూర్వకంగా కోరామని, తమ ఫిర్యాదు పట్టించుకోకపోడంతో ప్రమాదం సంభవించిందని ఎంఈవో మోహనరావు, ఉపాధ్యాయులు తెలిపారు. రామ్‌చరణ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.

తొమ్మిది మంది పందెంరాయుళ్ల అరెస్టు

కొత్తవలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటకాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో కోడిపందేలు ఆడుతున్నవారిని పట్టుకుని అరెస్టు చేసినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు చేయగా తొమ్మిది మంది నిందితులను పట్టుకుని వీరి వద్దనుంచి 16,440 రూపాయలు, 10 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు పందెంరాయుళ్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

కిలో గంజాయితో కేరళ వాసి..

కొత్తవలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేరళకు చెందిన ఓ వ్యక్తిని కిలో గంజాయితోఅరెస్టుచేసినట్టు సీఐషణ్ముఖరావు తెలిపారు.సీఐ కథనం మేరకు.. ఎస్ఐ జోగారావుకు సోమవారం వచ్చిన సమాచారం మేరకు కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని సోదాచేయగా బ్యాగ్‌లో కిలో గంజాయి లభించింది. దీంతో కొత్తవలస ఇన్‌చార్జి తహసీల్దార్ సునీత సమక్షంలో ఆ వ్యక్తి వివరాలను సేకరించారు. కేరళలోని కొత్తప్పడి వాయినడ్ జిల్లా మెప్పడి గ్రామానికి చెందిన పిచన్ కున్ అసిరి నాశిక్ అలియాస్ నాజిక్ పీకె(29)గా గుర్తించారు. తహసీల్దార్, వీఆర్వోల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

భోగాపురం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): భోగాపురానికి చెందిన యువకుడు ఆవాల చిరంజీవి అదృశ్యమయ్యాడని తల్లి లక్ష్మి ఫిర్యాదు చేసినట్లు సీఐ కె.దుర్గాప్రసాదురావు సోమవారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. చిరంజీవి కొత్తవలసలో పెయింటింగ్ పనులు చేస్తుండేవాడు. గతనెల ఒకటో తేదీ నుంచి తనకుమారుడు కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద, ఇతర గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసునమోదు చేశారు.

'రామాయణంలో ఆణిముత్యాలు' పుస్తకావిష్కరణ

విజయనగరం కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని జడ్పీ సమావేశ భవనంలో డోలా మన్మథకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సోమవారం రామాయణంలో ఆణిముత్యాలు అన్న పుస్తకాన్ని వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ కర్రోతు సత్యం,దేవునితో కాసేపు పుస్తకాన్ని నీటిపారుదలశాఖ రిటైర్డు చీఫ్ ఇంజనీరు ఐఎస్ ఎన్ రాజు ఆవిష్కరించారు. జిల్లా రచయితల సంఘం, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం సంయుక్త నిర్వహణలో నాలుగెస్సల రాజు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాలుగెస్సల రాజుతో పాటు, జిల్లాగ్రంథాలయ సేవా సంఘం ప్రతినిధులు కె. ఎర్రినాయుడు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వార్డులో సమస్యలను పరిష్కరిస్తా: కమిషనర్

రాజాం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వార్డులో ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని రాజాం మునిసిపల్ కమిషనర్ రామచంద్రరావు తెలిపారు. సోమవారం మునిసిపాలిటీలోని 17వ వార్డు పరిధిలోని ఆదర్శనగర్, గోపాలపురం రోడ్ తదితర ప్రాంతాలను సందర్శించారు. డ్రైనేజి సమస్య తీవ్రంగా ఉందని, పలు వీధుల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయని వార్డు నాయకులు మరిపి జగన్మోహనరావు, గంది గోపి, రామారావు, ఎరుకునాయుడు తదితరులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.



సమస్యలను కమిషనర్‌కు వివరిస్తున్న 17వ వార్డు వాసులు

మృతిచెందిన చేపల తరలింపు

విజయనగరంటౌన్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పెద్దచెరువులో మృతిచెందిన చేపలను తరలించారు. పెద్దచెరువు ఎందుకిలా శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఈమేరకు నగరపాలకసంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశాలమేరకు ప్రజారోగ్యసిబ్బంది, మత్స్యకార సొసైటీ ప్రతినిధులు సంయుక్తంగా చేపలను తరలించారు. చెరువులో మృతిచెందిన గొరవ చేపలను తొలగించేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచామని కమిషనర్ తెలిపారు.పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటుచేసి చెరువుచుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రం చేయనున్నట్లు చెప్పారు. మృతి చేపలను గుణుపూరుపేటలో ఉన్న డంపింగ్‌యార్డులో గోయ్యి తీసి అందులో పూడ్చిపెట్టినట్లు తెలిపారు.



మృతిచెందిన చేపలను తరలిస్తున్న సిబ్బంది

విద్యాసంస్థల కోసం మీరా మాట్లాడేది?

రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థల కోసం మీరు మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. పట్టణంలో తన నివాసంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద ఉంచిన ఘనత మీదేనన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిని చూసి మీకు ఎసిడిటీ వచ్చినట్టు ఉందన్నారు. భామినిలో ఈ నెల 5న పేరెంట్, టీచర్ మీట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సామాన్యంగా వచ్చి హాజరై విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తే వాటిని వైసీపీ మాజీ ప్రజాప్రతినిదులు సిగ్గుచేటు అనడం హాస్యాస్పద మన్నారు. పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మక్కువ మండల అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

అనుమతులు రాక.. కట్టుకోలేక!

(5వ పేజీ తరువాయి)

చిన్నపాటి పూరిపాకలు, రేకులషెడ్డులను వేసుకున్నారు. గోడలుగా పరదాలను కట్టుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం చలికి వణుకుతూ తీవ్ర ఇబ్బందులపాలవుతున్నారు. ఇదిలా ఉండగా నారాయణగూడలో మౌలిక వసతులు కొరవడ్డాయి. పక్కా గృహాలతో పాటు తాగునీరు, అంతర్గత సీసీ రహదారులు, వీధిలైట్లు లేవు. ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం కూడా లేకపోవడంతో చిన్నారులు సమీపంలో ఉన్న లోకొత్తవలసకు వెళ్లాల్సి వస్తోంది. రేషన్ సరుకుల కోసం సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కుసిమి జీసీసీ డీఆర్ డిపోనకు చేరుకోవాల్సి వస్తోంది. నారాయణగూడకు పక్కా రహదారి కూడా లేదు. సీతంపేట నుంచి ఈ గ్రామానికి చేరుకోవాలంటే పాలకొండ మీదుగా లోకొత్తవలస, గదబవలస దాటి సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. అదే కొండపై నుంచి అయితే పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కుసిమి వరకు కాలినడకన వెళ్లాలి. అక్కడి నుంచి సీతంపేటకు మరో పది కిలోమీటర్లు మేర ప్రయాణించాల్సి ఉంది. తమ సమస్య పరిష్కరించాలని ఎన్నిసార్లు ఐటీడీఏ, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులకు వినతులు ఇచ్చినా ఫలితం లేకపోయిందని గ్రామానికి చెందిన సవర వీరన్నగణేష్, సవర సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు.

పరదాలే గోడలుగా..

'మా గ్రామం ఆర్ఎఫ్(రిజర్వ్ ఫారెస్ట్)లో ఉందని ఎవరూ చెప్పలేదు. అయితే అధికారుల మాటలు నమ్మి ఉన్న ఇంటిని తొలగించి.. నేడు నిలువనీడ కోసం అల్లాడుతున్నాం. పరదాలనే గోడలుగా మార్చుకొని జీవిస్తున్నాం.' అని హౌసింగ్ లబ్ధిదారుడు సవర సింహాచలం తెలిపాడు.

అధికారులు స్పందించాలి

' ఐదు నెలలు గడుస్తున్నా.. అటవీశాఖ నుంచి అనుమతులు రాలేదు. అధికారులు భరోసా ఇస్తేనే ఉన్న ఇంటిని తొలగించి, పక్కా గృహాల నిర్మాణాలకు సిద్ధపడ్డాం. కానీ నేడు నిలువనీడ కరువై చిన్న పిల్లలతో అల్లాడుతున్నాం. పురిపాకలు, రేకుల షెడ్లల్లో జీవనం సాగిస్తున్నాం. దీనిపై అధికారులు స్పందించాలి.' అని గ్రామానికి చెందిన లబ్ధిదారు సవర సుక్కమ్మ కోరింది.

అనుమతులు రావాల్సి ఉంది

'నారాయణగూడ గ్రామం శ్రీకాకుళం జిల్లా ఆర్ఎఫ్(రిజర్వ్ ఫారెస్ట్) పరిధిలో ఉంది. అటవీశాఖ అభ్యంతరాలు తెలపడంతో ఆ గ్రామస్థులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అక్కడ గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ఎస్‌డీఎల్‌సీ(సబ్ డివిజనల్ కమిటీ) నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఎల్‌డీఎల్‌సీ ఆమోదం తెలిపిన తరువాత డీఎల్‌సీ(డివిజనల్ లెవెల్ కమిటీ) నంచి అనుమతులు పొందాల్సి ఉంది. ఇప్పటికే సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాల పరిధిలో ఆర్ఎఫ్‌లో ఉన్న 208 గృహాలకు క్లియరెన్స్ ఇప్పించాం. ఇక సీతంపేట మండలంలో ఆర్ఎఫ్‌లో ఉన్న 58 గృహాలకు క్లియరెన్స్ ఇప్పిం చాల్సి ఉంది.' అని రెవెన్యూ డీటీ వెంకట్రావు తెలిపారు.

ఎఫ్ఆర్‌వో ఏమన్నారంటే..

' నారాయణగూడ గ్రామం ఆర్ఎఫ్‌లో ఉంది. అక్కడ గృహ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలులేదని గిరిజనులకు చెప్పాం. ఎస్‌డీఎల్‌సీ క్లియరెన్స్ ఇచ్చిన తరువాత డీఎల్‌సీలో పెట్టి ఆ గ్రామ గిరిజన లబ్ధిదారులకు అనుమతులు మంజూరు చేస్తాం. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తవుతుంది.' అని పాలకొండ అటవీశాఖ ఎఫ్ఆర్‌వో రామారావు తెలిపారు.

ఆరునెలలు గడువు ఇవ్వాలి

పాలకొండ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రతిపాదిత విత్తన చట్టంపై రైతు, రైతు సంఘాల అభి ప్రాయానికి ఆరు నెలలు గడువు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు కోరారు. సోమవారం పట్టణంలోని కార్గిల్ సెంటర్ లో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు ఈ సందర్భంగా బిల్లు ప్రతులను దహనం చేశారు. అనంతరం అప్పలనాయుడు మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయే పరిహారం ఇచ్చేలా చట్టంలో నిబంధన పొందుపర్చాలన్నారు. విత్తన బిల్లును మోడల్ చట్టంగా చేసి రా ష్ట్రాలు తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్చుకునే అవకాశం కల్పించాలన్నారు. విత్తన ధరలు, సరఫరా, నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలన్నారు. నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు 60 రోజుల్లో గరిష్ట దిగుబడికి సమానమైన పరహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో రైతు సంఘం నేతలు వావిలపల్లి రమణమూర్తి, కిమిడి రామ్మూర్తి నాయు డు, సాంబమూర్తి, సంగంనాయుడు, దుర్గారావు, ముల్లు గోపాలరావు, వీరన్నాయుడు, అరసాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

బెలగాం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : ఓ పార్టీ నాయకుడు డాకేటి గౌరునాయుడు, పీహెచ్‌సీ వైద్యులు హరికృష్ణ చేసిన అన్యాయం వల్ల తన తల్లి పొందూరు విద్యావతి మృతి చెందిందని మక్కువ మండలం డి.సిర్లాం గ్రామానికి చెందిన పొందూరు జ్యోత్స్న ఆరోపించారు. సోమవారం ఆమె తన తండ్రితో కలిసి కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం జోత్స్న విలేకరులతో మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖలో ఆశా కార్యకర్తగా పని చేసిన తన తల్లిపై అక్కసుతో స్థానిక ఓ పార్టీ నాయకుడు డాకేటి గౌరునాయుడు అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి హరికృష్ణ కనీసం దర్యాప్తు చేయకుండా అన్యాయంగా తన తల్లిని విధల నుంచి తప్పించారన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారుమళ్లీ విధుల్లోకి చేర్చుకోమని ఆదేశాలను జారీ చేసినా విధుల్లో చేర్చుకోలేదన్నారు. దాంతో మనస్తాపంతో తన తల్లి మృతి చెందారన్నారు. దీనిపై తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

పేకాట శిబిరంపై దాడి

వీరఘట్టం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): నడుకూరు శివారులోని ఇటుకల బట్టీలు వద్ద ఆదివారం రాత్రి పేకాట శిబిరంపై ఎస్‌ఐ జి.కళాధర్ తన సిబ్బందితో దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.43,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

'తెలుగు సాహితీ' సేవలు అమోఘం

రాయగడ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రవాసాంధ్రలో ఉంటూ తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణకు మూడు దశాబ్దాలుగా తెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ చేస్తున్న సేవలు అమోఘమని ప్రముఖ కవి, రచయత, విశ్రాంత అధ్యాపకుడు కె.జి. వేణు అన్నారు. సోమవారం రాయగడలో తెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ వార్షికోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు గుడ్ల గౌరీశంకర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా తెలుగుకు ఇంతటి వైభవం కనిపించడం లేదన్నారు. అందరి సహకారంతో సంస్థను మరింతగా ప్రగతి పథంలో నడిపేందుకు తన వంతు సహకరిస్తాన న్నారు. గౌరవ అధ్యక్షుడు, పురపాలక సంస్థ చైర్మన్ మహేష్ పట్నాయక్ మాట్లాడుతూ ఒక సంస్థను ఇంతకాలం కొనసాగించడం అంత సులభం కాదన్నారు. తనవంత సంస్థకు అన్ని వేళలా అండదండగా ఉంటానన్నారు. అనంతరం స్పందన నృత్య పాఠ శాల విద్యార్థినిల చేసిన శాస్త్రీయ నృత్యాలు అందరినీ అలరిం చాయి. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్ర మంలో ఉదయం సంస్థ సాహితీ కార్యదర్శి సింగిడి రామారావు అధ్యక్షతన సాహితీ సదస్సు జరిగింది. 30 మంది కవులు స్వీయ పఠనం చేశారు. కార్యక్రమంలో స్పందన కార్యదర్శి డాక్టర్ పి.తులసీ దాస్, సాంస్కృతిక కార్యదర్శి కె.కె.ఎం.పట్నాయక్ సభ్యులు పాల్గొన్నారు.


వేదికపై వేణు, గౌరి, మహేష్ పట్నాయక్, తులసీదాస్

ఒడిశా

గిరిజనుల సంస్కృతి గొప్పది

సీతంపేట రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. సీతంపేట ఏజెన్సీలో సోమవారం పర్యటించిన ఆయన అక్కన్నగూడను సందర్శించారు. అక్కడ గిరిజనులతో సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు, వంటలు, విద్య వంటి అంశాలపై మాట్లాడారు. అనంతరం గ్రామంలోని పాఠశాల విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రమాణాల స్థాయిని పరిశీలించారు.


గిరిజనులతో మాట్లాడుతున్న వెంకన్న

11న టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపదికన టీచర్ల నియామకానికి 11న పాఠశాలలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వీర్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. పీజీటీ ఫిజిక్స్, పీజీటీ బయా లజీ పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. ఇందుకు ఎమ్మెస్సీ బీఈడీ చేసినవారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాఠ్య ప్రణాళికలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

క్లాస్-4 ఉద్యోగుల జిల్లా కార్యదర్శిగా రామ్‌జీ

పాచిపెంట, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ క్లాస్-4 ఉద్యోగుల యూనియన్ జిల్లా కార్యదర్శిగా బి.రామ్‌జీ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా బి.రామ్‌జీ విదులు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ క్లాస్-4 ఉద్యోగుల సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్, రాష్ట్ర కార్య దర్శి రాజేశ్ ప్రభుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నారని రామ్‌జీ తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

పార్వతీపురం రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఏఎస్పీ మనీషారెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని విశాఖపట్నం రేంజ్ పరిధిలో ప్రారంభమైన అభ్యుదయం సైకిల్ యాత్ర సోమవారం మండలంలోని నర్సిపురం గ్రామానికి చేరుకుంది ఏఎస్పీ మనీషారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు తదితరులు యాత్ర బృందానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీఐ రంగనాథం, ఎస్‌ఐ సంతోషి, ఎంపీడీవో సత్యం, డిప్యూటీ ఎంపీడీవో పాపారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ మనీషారెడ్డి

బిల్లులు చెల్లించండి

పార్వతీపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గతంలో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లకు సంబంధించి బిల్లులు చెల్లించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. అలాగే సాలూరు మండలంలోని ఊట గెడ్డ డీలర్ తనపై దాడిచేశారని అనీల్ ఫిర్యాదు చేశారుతుపాను ప్రభావం కారణంగా అరటి పంట నష్టపోయిన గిరిజన రైతులకు నష్టపరిహారాన్ని అందించాలని సీపీఐ నాయకులు ఆర్‌వీఎస్ కుమార్ ఆధ్వర్యంలో రైతులు డిఆర్‌వో హేమలతకు వినతిపత్రాన్ని అందజేశారు.

విద్యార్థులకు సేవాదృక్పథం అవసరం

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సేవా దృక్పథం అవసరమని ఎంపీడీవో ఐ.వి.లక్ష్మి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జె.కె.పాడులో సోమవారం ప్రత్యేకసేవా శిబిరం ఏర్పాటైంది. ఎన్ఎస్ఎస్ పీవో రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో హాజరై మాట్లాడారు. చిన్నప్పటి నుంచే సేవాభావం అలవరచుకోవాలన్నారు. బాగా చదువుకుని ఉజ్వల భవిత పొందాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మొక్కలు నాటారు. కార్యక్ర మంలో కళాశాల అధ్యాపకులు శ్రీవాణి, సత్యారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయడం తగదు

పాలకొండ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం తగదని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ 1, 2 యూనిట్‌ల ఆధ్వర్యంలో వడమ, ఇందిరానగర్ కాలనీలోని ప్రత్యేక సేవా శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.శాంతి, ఉపాధ్యాయులు జి.విజయ్‌కిరణ్, వై.నిర్మల, వార్డు కౌన్సిలర్ ప్రతినిధులు టి.లక్ష్మణరావు, పి.బాబ్జీ, ఎన్ఎస్ఎస్ పీవోలు బి.జయమణి, బి.రాజు పాల్గొన్నారు.

కాశీపట్నంలో సేవాశిబిరం

మక్కువ రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం కాశీపట్నంలో ప్రత్యేక సేవా శిబిరం ఏర్పాటైంది. కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ మంజులవీణ సేవా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రధానంగా తీసుకుని వలంటీర్లు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. అలాగే వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. అనంతరం కాశీపట్నం మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సంబంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజుల పాటు ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాన్ని స్థానికంగా ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో కాశీపట్నం ఎంపీటీసీ సభ్యురాలు కోట జయలక్ష్మి, సర్పంచ్ కోట్ల నారాయణరావు, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీకాకుళం గణేశ్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతోనే ఆత్మహత్యల నివారణ

గరుగుబిల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే రైతుల ఆత్మహత్యల నివారణ సాధ్యమవుతుందని బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి ఎస్.సత్యనారాయణ అన్నారు. సోమవారం తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయంలో సబల్ - రైతు సాధికార సంస్థ నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ కళా రూపకాల శిక్షణ ముగింపు ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పూర్వపు వ్యవసాయ విధానాలతోనే రైతులు సంతోషంగా ఉండేవారన్నారు. ప్రస్తుతం అధిక దిగుబడులకు ఆశ పడి రసాయనిక వ్యవసాయ విధానాలను అవలంబిస్తున్నారన్నారు. సాగు ఖర్చులు పెరిగి, ఆదాయం తగ్గడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. బయో గ్రామాల కన్సల్టెంట్ ఆర్.వాసుదేవరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రకృతి విధానాలపై రైతులకు కళారూపాలతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రకృతి సాగుపై ప్రత్యేక అవగాహనతో పాటు సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్న డాక్టర్ పారినాయుడు కృషిని అభినందించారు. కార్యక్రమంలో సిలబస్ కన్సల్టెంట్ శివాజీ, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, సబల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శిరీష, బయో ప్రతినిధి పి.ఉమామహేశ్వరి, సంస్థ సిబ్బంది ఎం.నూకంనాయుడు, ప్రబోద్, ఎం.గౌరీశంకర్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయ కళాకారులకు సామగ్రిని అందజేస్తున్న సత్యనారాయణ

కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయండి

గరుగుబిల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అయ్యరక కార్పొరేషన్ ఏర్పాటుకు చొరవ చూపాలని బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి ఎస్.సత్యనారాయణను డాక్టర్ డి.పారినాయుడు, ఎం.వాసుదేవరావు, తోటపల్లి దేవస్థానం చైర్మన్ ఎం.పకీరునాయుడు, కురుపాం పీఏసీఎస్ చైర్మన్ డి.కిశోర్‌కుమార్ కోరారు. సోమవారం తోటపల్లిలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మార్కొండ వాసుదేవరావు తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి సేవలో..

గరుగుబిల్లి: చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి, కోదండరామ స్వామి దేవస్థానాలను బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి ఎస్.సత్యనారాయణ సోమవారం సందర్శించారు. దేవస్థానం చైర్మన్ ఎం.పకీరు నాయుడు, ఆలయ ప్రధాన అర్చకుడు వీవీ అప్పలాచార్యులు, దేవస్థానం అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ డి.పారినాయుడు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంత రం దేవస్థానం చైర్మన్, సేవా ట్రస్ట్ ప్రతినిధులు ఆయన్ని సత్కరించారు. కార్యక్రమంలో ఎం.ప్రకాశ్, టి.దుర్గారావు, ఎం.వాసుదేవరావు, జి.శ్రీరామ చంద్రమూర్తి, జి.శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

పాలకొండ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సహకార సంఘ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తం ఆందోళనలో భాగంగా సోమవారం డీసీసీబీ శాఖ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యచరణకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

అనుమానాస్పద మృతి కేసులో ఒకరి అరెస్టు

పాలకొండ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): బుక్కూరు గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి జామి విఠల్‌రావు అనుమానాస్పద మృతికి సంబంధించి కేసులో మృతుడి తండ్రి జామి రామప్పడును అరెస్టు చేసినట్టు సీఐ ఎ.ప్రసాదరావు తెలిపారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 2న ఆర్టీసీ డ్రైవర్ అనుమానాస్పదంగా మృతి చెందినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి రామప్పడును అరెస్టు చేశామన్నారు. మద్యం సేవించి ఇంటిలో తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్న కోపంతో తండ్రి గొడ్డలితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందినట్టు తెలిపారు.

ఉపాధి లక్ష్యాలను అధిగమించండి

గరుగుబిల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో లక్ష్యాలను అధిగమించడంతో పాటు వేతనదారుల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో జి.పైడితల్లి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధి పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు సాంకేతిక సహాయకులు ముందస్తు కొలతలు ఇచ్చి పనులు చేయించాలన్నారు.సమావేశంలో ఏపీవో ఎం.ఈశ్వరమ్మ, ఇంజనీరింగ్ సలహా దారులు డి.తేజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వినతిపత్రం

పార్వతీపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై కాం గ్రెస్ పార్టీ నాయకులు సోమవారం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించి విజయవంతంగా అమలు చేస్తున్నందుకు కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భోజన పథకాన్ని ప్రైవేటీకరించవద్దు

కురుపాం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకాన్ని స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రైవేటీకరించాలనే ప్రభుత్వ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలులో జాప్యం

● నిబంధనలతో రైతుల అవస్థలు

భామిని, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రంలో పత్తి కొనుగోలు ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమైనప్పటికీ సోమవారం రైతులు అధిక సంఖ్యలో కేంద్రానికి పత్తిని తరలించారు. పత్తి కొనుగోలు నిబంధనల మేరకు కొంత జాప్యం జరుగుతోంది. రైతులు జాబితాను పరిశీలించి సీఎం యాప్‌లో నమోదు చేశాక పత్తిని మొదట్లో తేమశాతం చెక్ చేయించుకుని బ యాప్‌లో పత్తి విక్రయానికి శ్లాట్ బుక్ చేస్తే సీసీఐ పంటను కొనుగోలు చేస్తోంది. పత్తి విక్రయాల సమయంలో ఆధార్, వన్-బి పాస్‌బుక్, మూడు సెంట్లు అందించాల్సి ఉంది. పత్తి కొనుగోలు కోసం పాలకొండ మార్కెట్ కమిటీ అధికారులు, రైతు సేవా సిబ్బంది సహకరిస్తున్నారు. అయితే గోనె సంచులు లేకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. దీనికి తోడు లగేజీ వాహనం దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. దీనిపై మార్కెట్ కమిటీ కార్యదర్శి సంతోష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా సీసీఐ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. ఇప్పటివరకు 398 క్వింటాళ్ల కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సోమవారం 90 క్వింటాళ్ల కొనుగోలు చేసినట్టు వెల్లడించారు.


కొనుగోలు కేంద్రం వద్ద అన్‌లోడ్ చేస్తున్న పత్తి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

సమస్యలను తక్షణమే పరిష్కరించండి

పాలకొండ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశించారు. సోమవారం గొట్టమంగళాపురం, చిన్నమంగళాపురం, బుక్కూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం మండలంలోని చిన్న మంగళాపురం గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్స్, బోరుబావిని ఎమ్మెల్యే ప్రారంభించారు. మంగళాపురం సచివాలయం పరిధిలో పలువురు రైతులకు అన్నదాతా సుఖీభవ నిధులు జమ కానట్టు ఎమ్మెల్యే గుర్తించారు. వారి వివరాలను తెలియజేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను ఎమ్మెల్యే కోరారు. ఆ వివరాలను ఆయన చెప్పకపోవడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని పాలవలస సిమ్మయ్య హైదరాబాద్‌లో మృతిచెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో ఎమ్మెల్యే జయకృష్ణ

పీజీఆర్ఎస్‌కు 35 వినతులు

సీతంపేట రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జి ఏపీవో ఆర్.వి.గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు గిరిజనుల నుంచి 35 వినతులు అందాయి. పౌల్ట్రీ ఏర్పాటుకు రుణం మంజూరు చేయాలని కారిగూడ, పాలమానుగూడ, దీసరగూడ, కొండవానిగోర గ్రామాలకు చెందిన సవర నరేష్, బిడ్డిక భాస్కరరావు, సవర కృష్ణ, బాపన్న వినతిపత్రాలు అందజేశారు. పులిపుట్టి రెవెన్యూ పరిధిలోని గిరిజన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం మంజూరు చేయాలని ఎల్.తవిటమ్మ, కె.తులసమ్మ కోరారు. ఆర్ఎఫ్ఆర్ భూముల్లో రీసర్వే చేసి పట్టా ఇప్పించాలని వి.సొంబూరు కోరారు. బర్న గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మత్తులు చేయించాలని ఎం.మురళీ వినతిప్రతం అందజేశారు. పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జి ఏపీవోతో పాటు డిప్యూటీ ఈవో జి.రామ్మోహనరావు, ఉపాధి హామీ పథకం ఏపీడీ శ్రీహరి, పీఆర్ డీఈఈ రాధారాణి తదితరులు పాల్గొన్నారు.


గిరిజనుల సమస్యలు వింటున్న ఇన్‌చార్జి ఏపీవో

రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

బెలగాం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): క్వింటాకు అదనంగా ఐదు కేజీలు ధాన్యం తీసుకుంటే రైస్ మిల్లర్స్ రైతులను దోపిడీ చేస్తున్నారని రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు ఆరోపించారు. దళారీలు, మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను కాపాడాలని కోరుతూ రైతులతో కలిసి రైతు సంఘం నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి ధాన్యం గింజ రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. దళారీల బారి నుంచి రైతులను కాపాడాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు

దివ్యాంగుడికి టచ్ ఫోన్ అందజేత

పార్వతీపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలంలోని గరుగుబిల్లికి చెంది దివ్యాంగుడు ఎ.అఖిల్‌కు తనకు టచ్ ఫోన్ మంజూరు చేయాలని సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తక్షణమే టచ్ ఫోన్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, విభిన్న ప్రతిభావంతులు శాఖాధికారి ప్రతినిధి రమణ ఉన్నారు.